క్లుప్తంగా

సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలంలోని మిథల్, విజయలక్ష్మీ, ఐఎఫ్‌పీసీఎల్ జిన్నింగ్ మిల్లులతో పాటు నార్నూర్ జిన్నింగ్ మిల్లుల్లో జనవరి 1 నుంచి 5 వరకు సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు నిలిపివేయడం జరుగుతుందని ఇంద్రవెల్లి వ్యవసాయశాఖ కార్యదర్శి రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి నిల్వలు పేరుకుపోయినందున కొనుగోళ్లు ఉండవన్నారు. రైతులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని బోథ్, నేరడిగొండ, పొచ్చెర, సొనాలలో ఈనెల 31 నుంచి జనవరి 2 వరకు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మోదీ మళ్లీ ప్రధాని కావాలని పాదయాత్ర

ఆదిలాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ మూడో సారి ప్రధానమంత్రి కావాలని నిర్మల్ జిల్లా కుభీర్‌కు చెందిన జాదవ్ మాధవరావు పటేల్ అనే యువకుడు అయోధ్యకు పాదయాత్ర చేస్తున్నాడు. శనివారం జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆయనను రిమ్స్ ఆస్పత్రి వద్దగల మహాగణపతి దేవాలయంలో సనాతన హిందూ ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్, ఆలయ కమిటీసభ్యులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

'రాజీమార్గమే రాజ మార్గం'

బోథ్: రాజీ మార్గమే రాజ మార్గమని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్నేన్ అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో మొత్తం 752 కేసులు పరిష్కారం అయినట్లు తెలిపారు. బ్యాంకు కేసుల ద్వారా రూ.19 లక్షల 50 వేలు రికవరీ అయ్యాయి. బార్ అసోసియేషన్ కార్యదర్శి పంద్రం శంకర్, న్యాయవాదులు రూపేందర్ సింగ్, ఆడెపు హరీష్, విక్రమ్‌సింగ్, కుమ్మరి విజయ్ కుమార్, ధమ్మపాల్, జమీర్, బోథ్ సీఐ భీమేష్, ఎస్సై రాము పాల్గొన్నారు.

కౌన్సిలర్‌ను అరెస్టు చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రానికి చెందిన దళిత యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన బీజేపీ కౌన్సిలర్ ఉష్కం రఘుపతిని వెంటనే అరెస్ట్ చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవనంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు అల్లూరి భూమన్న, తుల్జాపూరి శోభతాయి, చందాల రాజన్న, ఓరగంటి నవీన్, ఈర్ల దయాకర్, నల్లరాజేశ్వర్, నిమ్మల ప్రశాంత్, సత్యనారాయణ, దేవిదాస్, క్రాంతి, రమేశ్, శశికాంత్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా పురుషోత్తంరెడ్డి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం ఎన్నికల అధికారి అరుణ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్‌ను ఎన్నుకున్నారు. అడేగామ(కె) డైరెక్టర్ బద్దం పురుషోత్తం రెడ్డిని వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి అరుణ పురుషోత్తంరెడ్డికి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో ఈశ్వర్, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. ఉదయం నుంచి నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం నాగోబా దర్బార్ హాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

పింఛన్లు అందించాలి

కైలాస్‌నగర్: అర్హులైన వారికి పింఛన్లు ప్రతి నెలా సకాలంలో అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌజింగ్‌బోర్డ్ కాలనీలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించి, అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. దరఖాస్తు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని సూచించారు. రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రత్యేకాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం

ఎదులాపురం: కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కార్యాలయంలో మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్, బీఆర్‌ఎస్‌కేవీ కార్మికులు, అంగన్‌వాడీ కార్మికులు సీఐటీయూలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, సాయి కార్యదర్శి ఎస్. నవీన్ కుమార్, పోచన్న, అగ్గిమల్ల స్వామి, దర్శనాల నగేశ్, లక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమాయక గిరిజనులే టార్గెట్

- దుప్పట్లు అమ్మకాల పేరిట గ్రామాల్లో సంచారం
- ప్రజలను నిండా ముంచి పరారీ



మోసాలకు పాల్పడుతున్న వారిని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

సిరికొండ: అమాయక గిరిజనులకు కష్టపడి పని చేయడమే మాత్రమే తెలుసు.. మనుషులను త్వరగా నమ్మె మంచితనం వారిది. కానీ వారే ఇతరులను నమ్మి, వారు చెప్పే మాయ మాటాలకు మోసపోతున్నారు. తీరా తము మోసపోయామని లబోదిబో అంటున్నారు. ఇటీవల సిరికొండ మండల కేంద్రంలో ఇలాంటి మోసాలు వెలుగుచూశాయి.

వ్యాపారం చిన్నది.. మోసం పెద్దది..

మోసం చేసేవారు కూడా అమాయకంగానే కనిపిస్తారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి దుప్పట్లు, స్వెటర్లు అమ్ముకుంటున్నారు. వారు చేసేది చిన్న వ్యాపారం అయినా.. మోసం మాత్రం భారీగా ఉంటాది. ఇతర రాష్ట్రాల నుంచి చిన్నచిన్న వ్యాపారులు చేసేందుకు గిరిజన గ్రామాలకు వచ్చి అమాయక గిరిజనులను, ఒంటరి మహిళలను, వృద్ధులను మాటాలతో మభ్యపెట్టి మోసం చేస్తున్నారు.

కరెన్సీ నోట్లు తయారు చేస్తామని..

ఇటీవల సిరికొండ మండలంలోని రాజంపేట్ గ్రామంలో చీరలు అమ్మే మధ్యప్రదేశ్‌కు చెందిన వారికి గ్రామానికి చెందిన పెందుర్ జంగు తమకు సంతానం లేదనే విషయం చెప్పాడు. దీంతో వారు తమ వద్ద సంతానం కలుగజేసే అదృష్టశక్తి ఉందని, సంతానం కోసం అదృష్ట శక్తి రావాలంటే మీఇంట్లో ధనలక్ష్మి ఉండాలని అందుకు తము తెల్ల కాగితాలతో కరెన్సీ నోట్లు తయారు చేసి ఇస్తామని రూ.3 లక్షలను కోటి రుపాయలు చేసి ఇస్తామని నమ్మించారు. చివరికి ఆ కుటుంబానికి అనుమానం రావడంతో పోలీసులను ఆశ్రయించడంతో వారి బండారం బయటపడింది. ఇలా ఒక్క కుటుంబమమే కాకుండా అనేక కుటుంబాలు మోసపోయిన ఘటనలు ఉన్నాయి.

రిమోట్ కాంటాతో రైతులను..

గత రెండు సంవత్సరాల క్రితం మండలంలోని సాత్‌మోరి గ్రామంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన పత్తి దళారులు రిమోట్ కాంటాతో గ్రామంలో తిరుగుతూ.. రైతుల వద్ద పత్తి కొనుగోలు చేశారు. తమ వద్ద ఉన్న రిమోట్‌తో తూకంను ఆపరేట్ చేస్తూ.. ఏకంగా 50 కిలోల కాజేసి దొరికిపోయారు. అలాగే గిరిజన రైతులను ఆసరాగా చేసుకొని గంజాయి సాగు చేసేలా ప్రోత్సహించి, గంజాయి మొక్కలను కొనుగోలు చేస్తున్నారు. ఇలా అన్నిరకాలుగా గిరిజనులను మోసం చేసి పరారు అవుతున్నారు.

అవగాహన కల్పించాలి..

అమాయక గిరిజనులే లక్ష్యంగా మోసాలు జరుగుతున్నా.. అధికారులు మాత్రం ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. ఇటీవల జరిగిన ఘటనలు చూస్తే ఇలాంటి మోసాలపై అవగాహన లేకపోవడమే అని తెలుస్తోంది. ఇప్పటికైన ప్రభుత్వాలు, పోలీసులు గిరిజనులకు మోసాలపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



మండలంలో జరుగుతున్న మోసాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో తిరుగుతూ.. ప్రజలను మాయ మాట్లాలతో మభ్యపెడుతున్నారు. అధికారులు కూడా మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ఇలాంటివి జరగకుండా చర్యలు చేపట్టాలి.

– పెందుర్ అమృత్‌రావు, ఎంపీపీ

కొత్త వ్యక్తులను నమ్మొద్దు



గ్రామంలోనికి వచ్చే కొత్త వ్యక్తులను నమ్మొద్దు. కష్టపడి పని చేసి డబ్బు సంపాదించుకోవాలి. అత్యాశకు పోవద్దు. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. గ్రామాల్లో కూడా పోలీసు నిఘా పెంచుతాం.

– చంద్రశేఖర్, సీఐ, ఇచ్చోడ

ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

ఆదిలాబాద్‌రూరల్: ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రానికి వలస వచ్చి అక్రమంగా ఎస్టీ ధ్రువీకరణ పత్రాలను పొందుతున్నారని, అధికారులు దరఖాస్తులను సున్నితంగా పరిశీలించి నిజమైన ఆదివాసీలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) నాయకులు కోరారు. శనివారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలో గల సర్వే నంబర్ 72లోని కుమురం భీం గూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేసేందుకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరిస్తుందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి చాలా కుటుంబాలు వలస వచ్చినట్లు తమ దృష్టికి రావడం జరిగిందన్నారు. ఆధార్ కార్డు, కొత్తగా రేషన్ కార్డులు పొంది సంక్షేమ పథకాలు పొందే అవకాశం ఉందని, దీంతో నిజమైన ఆదివాసీలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టినంతరమే సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని కోరారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావ్, నాయకులు పుస్నాక్ నాగోరావ్, గోవింద్‌రావ్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెట్టి మనోజ్

లంబాడాల దరఖాస్తులు స్వీకరించొద్దు

బోథ్: ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో ఆదివాసీ చట్టాలకు లోబడి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించాలని తుడుందెబ్బ బోథ్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు దుర్వ విశ్వేశ్వర్ అన్నారు. శనివారం తుడుందెబ్బ బోథ్ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస రావడంతో ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలకు ఉద్యోగాలు, ఉపాధిలో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఆదివాసీలు తమ అస్థిత్వం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామెల్లి భోజన్న, బోథ్ డివిజన్ ఉపాధ్యక్షుడు కుర్మె రాజన్న, పంద్రం శంకర్, తొడసం గోపాల్, శంకర్ పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల శోభాయాత్ర

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గల శ్రీఅభయ ఆంజనేయ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ జన్మభూమి అక్షింతల శోభాయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతులతో శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

బేల: మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలోని హనుమన్ ఆలయంలో శనివారం శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామాలకు అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. ట్రస్ట్ మండల ఇన్‌చార్జి గుండవార్ శ్రీనివాస్ గ్రామస్తులకు అక్షింతలు పంపిణీ చేశారు. ప్రతి ఇంటా భక్తిశ్రద్ధలతో అక్షింతలు పూజగదిలో భద్రపర్చాలన్నారు. వచ్చే నెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఇంట్లో ప్రత్యేక పూజలు చేసుకుని, తలమీద అక్షింతలను వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బర్కాడే రాము, పోత్రాజ్ కిష్టన్న, అగార్కర్ అకాష్, కోడే ప్రదీప్, మనోజ్‌రెడ్డి, నిపుంగే వినోద్ పాల్గొన్నారు.


అక్షింతలు అందజేస్తున్న గుండవార్ శ్రీనివాస్

ఆర్థిక సాయం అందజేత

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన దుల్శెట్టి సుజాత, దయానంద్‌లు ఇటీవల బైక్‌పై వస్తుండగా అడవి పంది అడ్డు రావడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డా రు. చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న గుడిహత్నూర్ మాజీ సర్పంచ్ పవార్ రవీంద్ర నాయక్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

జైనథ్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం మండలంలోని కంఠం గ్రామంలో నిర్వహించిన సప్తాహ ముగింపు వేడుకలకు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. బాజీరావు బాబా చూపిన బాటలో నడవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో బాజీరావు బాబా పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. శనివారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సెక్టార్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. డిజిటల్ విద్య కార్యక్రమాల ద్వారా బోధించాలని కార్యకర్తలకు సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు సైతం పౌష్టికాహారం అందించాలన్నారు.

పుస్తకావిష్కరణ

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న చిలక సతీష్ రూపొందించిన 'మా అనుభవాలు' అనే పుస్తకాన్ని మండల నోడల్ అధికారి ఇదాపు పోశెట్టి శనివారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల అనుభవాలను ఇందులో పొందుపరిచినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్ గౌడ్, సునీల్, సీతారాం, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్‌కు సిద్ధం..



ఆదిలాబాద్: న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించుకునేందుకు సర్వం సిద్ధమైంది. 2023కు వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు యువత అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వేడుకల కోసం వెరైటీ కేకులను మార్కెట్లో సిద్ధంగా ఉంచారు. రూ. 150 నుంచి రూ. 2000 వరకూ కేకులు అందుబాటులో ఉన్నాయి. కొంత మంది ఆర్డర్ ఇచ్చి ప్రత్యేకంగా తయారు చేయించుకుంటున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని అన్ని కూడళ్లల్లో కేక్‌ల అమ్మకాల కోసం ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేశారు.





గ్రామ దేవతలకు ఎంతో ప్రాధాన్యం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: తెలంగాణలో గ్రామ దేవతలకు ఎంతో ప్రాధాన్యం ఉందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మోచిగల్లి కాలనీలో గల మైసమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామదేవతల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్, ఆదినాథ్, జోగురవి గంగాధర్, సురేష్, రాకేశ్, సూర్య పాల్గొన్నారు.

ప్రపంచ నలుమూలల నుంచి అయోధ్యకు పయనం

ఆదిలాబాద్: అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో ప్రపంచ నలుమూలల నుంచి ప్రజలు అయోధ్యకు చేరుకుంటున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ నుంచి అయోధ్య రామ జన్మభూమికి సైకిల్‌యాత్ర చేపట్టిన 11 మంది యువకులు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో విడిది చేసిన యువకులను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీ రామ చంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి, బీజేపీ నాయకులు ఆదినాథ్, రాకేశ్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి


యాత్రికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్‌లోని టీయూటీఎఫ్ సంఘ కార్యాలయంలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.శ్రీకాంత్, బేర దేవన్న, జలంధర్ రెడ్డి, రంగినేని రామారావు , గంగ్రత్ నారాయణ, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదిలాబాద్: వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం (పెటా టీఎస్) క్యాలెండర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, స్వామి, కోశాధికారి సాయికుమార్, కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి రాష్ట్ర పాల్, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ గౌడ్, కృష్ణ, అశ్వత్ రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన ఉండి పోరాడాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: ప్రజల పక్షాన ఉండి పోరాడాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ కృతజ్ఞత సభలో పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలంతా నా కుటుంబ సభ్యులుగా చూసుకుంటానని అన్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలులో జాప్యం జరిగే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ హామీలు అమలు చేయకుంటే నిలదీయాలన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, మాజీ ఎంపీ గొడం నగేశ్ మాట్లాడుతూ.. అధికారంలోకి రావడం కోసమే ఆరు గ్యారంటీలు ఇచ్చిందన్నారు. రుణమాఫీ, రైతుబంధు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసి నెల రోజులవుతున్నా ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. సమావేశంలో ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎంపీపీలు ప్రీతంరెడ్డి, రాథోడ్ సజన్, శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీలు రాజు, సంధ్యారాణి, కుమ్ర సుధాకర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

మండల అభివృద్ధికి కృషి

సిరికొండ: మండల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పంచాయతీ భవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలన్నారు. మండల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గొడం నగేశ్, ఎంపీపీ పెందూర్ అమృత్‌రావు, సర్పంచ్ ఓరగంటి నర్మాద, ఉప సర్పంచ్ తోకల చందు, ఫర్వీన్ బేగం, సూర్యకాంత్, ఓరగంటి పెంటన్న, లక్ష్మణ్, నర్సయ్య పాల్గొన్నారు.

'ప్రజాపాలన' సద్వినియోగం చేసుకోవాలి

నేరడిగొండ: ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సంతోష్ రెడ్డి అన్నారు. మండలంలోని బొందిడి, దర్బతండా, బోరిగాం, బుద్దికొండ, లఖంపూర్(జి) గ్రామాల్లో శనివారం ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు.

బేల: మండలంలోని బెదోడ, కాప్సి(బి), మాంగ్రుడ్, కోగ్దూర్, మశాల(కె), పోహర్ గ్రామాల్లో మూడో రోజు శనివారం గ్రామసభలు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి శంకర్ దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు.

తలమడుగు: అందిరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. మండలంలోని ఉమ్రి, కోసాయి, అర్లి(కె), సక్నాపూర్ గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు.

బోథ్: పార్డి(బి), సాంగ్వి, చింతగూడ, ఘన్‌పూర్, కంటెగాం, లండాబాతండా గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో సునీల్ రెడ్డి, ఎంపీవో జీవన్‌రెడ్డిలు దరఖాస్తులు స్వీకరించగా.. నోడల్ అధికారి డీఎస్‌వో కిరణ్ కుమార్ పర్యవేక్షించారు.

జైనథ్: ప్రజాపాలన గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి, ప్రజాపాలన నియోజకవర్గ ఇన్‌చార్జి పి.శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని మాంగుర్ల గ్రామంలో ప్రజాపాలన గ్రామసభలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

ఇంద్రవెల్లి: అర్హులైన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని హర్కపూర్, హర్కపూర్‌తండా, గిన్నేరా, సమాక గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.


తాంసి: బండల్‌నాగాపూర్‌లో..

నార్నూర్: నార్నూర్ మండలంలోని ఖంపూర్, మహగావ్, ఖైర్‌డాట్వా, గాదిగూడ మండలంలోని లోకారి(బి), డొంగర్‌గావ్, రాంపూర్, సావురి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రమేశ్, ఎంపీవో సాయిప్రసాద్ దరఖాస్తులు స్వీకరించారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని టక్కుగూడ, లింగోజీతండా, సాలెవాడ(కె), మత్తడిగూడ, శ్యాంనాయక్‌తండా, పులిమడుగు గ్రామాల్లో ప్రజల నుంచి ఎంపీడీవో తిరుమల, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీవో మహేశ్‌లు దరఖాస్తులను స్వీకరించారు.

తాంసి: అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని జెడ్పీటీసీ రాజు అన్నారు. శనివారం మండలంలోని బండల్‌నాగాపూర్, హస్నాపూర్ గ్రామాల్లో ఎంపీపీ మంజుల దరఖాస్తులు స్వీకరించారు. హస్నాపూర్ గ్రామంలో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణను ఆర్డీవో స్రవంతి పరిశీలించారు. భీంపూర్ మండలంలోని బెల్సరీరాంపూర్, మార్కగూడ గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాస్ దరఖాస్తులను స్వీకరించారు.

ఇచ్చోడ: జనవరి 6 వరకు గ్రామసభల ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తహసీల్దార్ తుకారాం తెలిపారు. శనివారం మండలంలోని గాంధీనగర్‌లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆది, సోమవారం ప్రజాపాలన గ్రామసభలు ఉండవని తెలిపారు.


ఇంద్రవెల్లి: అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్


జైనథ్: దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారి

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

ఇంద్రవెల్లి: మండలంలోని హర్కపూర్, అంద్‌గూడ పరిధిలోని మామిడిగూడ గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్ అన్నారు. శనివారం గ్రామాన్ని సందర్శించి, తాగునీటి సమస్యలను అడిడి తెలుసుకున్నారు. రోడ్డు పనులు పూర్తయిన వెంటనే ప్రత్యేకంగా పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుడే కైలాస్, నాయకులు మసూద్, ముఖడే ఉత్తం, భీంరావ్, అధికారులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఈ సురేశ్